క్లుప్తంగా

22 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు సోమవారం జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 19 మందికి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున, మరో వ్యక్తికి 3వేలు, ఇద్దరికి 5 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి

కంది(సంగారెడ్డి): గ్రామాల అభివృద్ధికి కృషి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ కొండల్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిమ్నాపూర్‌లో రూ.20లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణగౌడ్, సర్పంచ్ ప్రమీలప్రకాష్, ఎంపీటీసీ నందకుమార్, నాయకులు మోహన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్: తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే జగ్గారెడ్డి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. సంగారెడ్డిలో చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనంతో పాటు 180 రోజుల ప్రసూతి సెలవులు, మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని గీసి వారి సమస్యలను చిత్రపటానికి తెలియజేస్తూ నిరసన తెలిపారు.

వేతనాలు చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామ శివారులోని మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులు సోమవారం విధులు నిలిపివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏడు నెలలుగా తమకు జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ నెల 10వ తేదిలోపు జీతాలు చెల్లిస్తామని చెప్పిన అధికారులు నేటికీ చెల్లించడంలేదన్నారు. తమకు జీతాలు చెల్లించేవరకు ఆందోళనలు, నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు నర్సింహులు, రాములు, బిచ్చయ్య, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

జహీరాబాద్: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఇతర ఎరువులు ఎంతమేర అందుబాటులో ఉన్నాయనే వివరాలను సేకరించారు. ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తనిఖీల్లో ఆర్డీఓ వెంకారెడ్డి, ఏఓ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాల్సిందే..

- అంగన్‌వాడీ కార్మికుల డిమాండ్
- నిరవధిక సమ్మె ప్రారంభం



నారాయణఖేడ్: సమ్మె నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



హత్నూరలో..



రాయికోడ్‌లో..



సంగారెడ్డి టౌన్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ, ఆయాలు ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరవధిక సమ్మెకు దిగారు. తమను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పదవి విరమణ ప్రయోజనం కింద రూ.10 లక్షలు చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. సమ్మెకు సీఐటీయూ మద్దతు తెలిపింది.



సదాశివపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట..



కొండాపూర్: మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



జహీరాబాద్ టౌన్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట..



రామచంద్రాపురంలో..

'బీఆర్‌ఎస్ మాకు పోటీయే కాదు'

జిన్నారం(పటాన్‌చెరు): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తమకు పోటీయే కాదని, బీజేపీ–కాంగ్రెస్‌ల మధ్యనే పోరు జరుగుతుందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నందీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పార్టీ అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయించినా కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, జగన్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

బకాయిలు జమ

జహీరాబాద్: జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం పరిధిలోని చెరకు రైతుల ఖాతాల్లో రూ.1,12,78,691 మేర బకాయిలను జమ చేసినట్లు కేన్ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి హరీశ్‌రావు, ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్ రావు, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ సూచనలతో కలెక్టర్, ఎస్పీ, చక్కెర కమిషనర్‌ల ఆదేశాల మేరకు తహశీల్దార్ ఖాతా నుంచి 184 మంది రైతుల ఖాతాల్లో బకాయిలను జమ చేసినట్లు తెలిపారు. రైతులకు రావాల్సిన మిగతా బకాయిలను సైతం త్వరలో ఇప్పించేందుకు యాజమాన్యంపై చర్యలు చేపట్టినట్లు వివరించారు.

వైద్యులను నియమించాలని వినతి

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం గ్రామంలో ఏర్పాటు చేయనున్న పల్లె దవాఖానలో వైద్యులను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సర్పంచ్ ప్రకాశ్‌చారి మంత్రి హరీశ్ రావుకు విన్నవించారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన గురుపూజోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు, రెసిడెన్షియల్ కళాశాలలు, మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేసి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే నేతృతంలో ప్రతి ఏడాది గురుపూజోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీలు సుష్మశ్రీ, ప్రవీణ, జెడ్పీటీసీలు సుప్రజ, సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కార్పొరేటర్ కుమార్ యాదవ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సామరస్యాన్ని పెంపొందిస్తున్నాం

పటాన్‌చెరు: కుల, మతాలకు అతీతంగా నియోజకవర్గంలో సర్వమత సామరస్యాన్ని పెంపొందిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐనోలు గ్రామంలో నిర్మించనున్న రామాలయం నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచ్ పద్మవెంకటేష్, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు) ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తాంబేలు గుట్టవద్ద నూతనంగా నిర్మించనున్న జ్యోతిర్లింగ శివాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు వెంకటేశంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, భోజిరెడ్డి, ఆనంద్‌చారి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు



బోనాల ఉత్సవాల్లో నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎన్‌ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు మండలంలోని రుద్రారంలో నిర్వహించి పోచమ్మతల్లి బోనాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శివాజీ యువజన సంఘం సభ్యులు, గ్రామపెద్దలు, ప్రజలు, ఎన్‌ఎంఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ఆకాంక్షించారు. గుమ్మడిదల మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన శ్రావణమాస పోచమ్మతల్లి బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నీలం మధును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి ప్రాధాన్యం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంజూరైన అంబులెన్స్, నూతన పంచాయతీరాజ్ సబ్ ఇంజనీర్ కార్యాలయం, మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామంలో బీసీ కమ్యూనిటీహాల్, సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాచయ్యస్వామి, ప్రజాప్రతినిధులు జగదీశ్వర్, విజేందర్‌రెడ్డి, రాజు, అమర్జిత్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటో సౌకర్యం



ఆటోను ప్రారంభిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామంలోని శ్రీరాంనగర్ కాలనీ నుంచి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఇటీవల స్థానిక యువజన సంఘం నాయకులు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన నీలం మధు ఇచ్చిన హామీ మేరకు విద్యార్థుల సౌకర్యం కోసం కేటాయించిన ఆటోను సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు ప్రారంభించారు.

'పాలనా సౌలభ్యం కోసమే కార్యాలయాలు'



పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): పరిపాలనా సౌలభ్యం కోసమే కేసీఆర్ ప్రభుత్వం ప్రజల ముంగిటకు ప్రభుత్వ కార్యాలయాలను తెస్తోందని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం ఎంపీపీ కార్యాలయ ఆవరణలో పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీశ్వర్, ఎంపీపీలు యాదమ్మ, మనోజ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శ్రీధర్ రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

మండల పరిధిలోని అంకెనపల్లి గ్రామానికి చెందిన సుశీల కుటుంబసభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ 2.50 లక్షల విలువైన ఎల్‌ఓసీని సోమవారం క్యాంపు కార్యాలయంలో టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ అందజేశారు. ఎంపీటీసీ అహ్మద్, సర్పంచ్ విజయలక్ష్మి, ఉపసర్పంచ్ మల్లేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా భవానిమాత వార్షికోత్సవం

కంది(సంగారెడ్డి): కంది మండల పరిధిలోని కొలంపేట్‌లో సోమవారం భవానిమాత ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. డీసీసీ బ్యాంక్ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం, సర్పంచ్ షఫీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పారామెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యాలయం ప్రారంభం

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి పట్టణంలోని గీతానగర్‌లో పారామెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యాలయాన్ని చింతా ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హుస్సేన్, హరిఫదిన్, బాలకష్ణ, ఖాజాఖాన్, అనిల్ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్‌కు సంపూర్ణ మద్దతు

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను సోమవారం మండల పరిధిలోని నాగ్‌సాన్‌పల్లి గ్రామ యువసేన, గణేష్ యూత్ సభ్యులు పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి మద్దతు ప్రకటించారు. అనంతరం చింతా ప్రభాకర్‌ను సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ **పార్టీ బలోపేతానికి కృషి**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. జిన్నారంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బీజేపీ నుంచి పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ, వైస్‌ఎంపీపీ రమేశ్ పాల్గొన్నారు.

◆ **బకాయిల చెల్లింపు నిర్ణయంపై సంబురాలు**

జహీరాబాద్: చెరకు క్రషింగ్‌ను నిర్వహించేందుకు వీలుగా కార్మికులను విధుల్లోకి చేర్చుకుని వారి వేతన బకాయిలు చెల్లించేందుకు ట్రైడెంట్ యాజమాన్యం నిర్ణయించినందున కార్మికులు స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంజి రాములు, అధికారులు ప్రసాద్,శర్మ,కార్మిక నాయకులు పాల్గొన్నారు.

◆ **శ్రమదానం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం విద్యార్థులు శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలోని పేరుకపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు.

◆ **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఇస్నాపూర్ చౌరస్తాలో ఈ నెల 6వన భిక్షాటన చేసుకుంటూ ఉండే 65 ఏళ్ల పైబడిన వ్యక్తి పడిపోయి ఉండటంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

◆ **ఎంపీని కలిసిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్**

జహీరాబాద్: టీఎస్ఎస్సీసీడీఎస్ చైర్మన్‌గా నియమితులైన నరోత్తం జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ బీబీపాటిల్ నరోత్తంను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

◆ **చెక్కులు పంపిణీ**

పటాన్‌చెరు: అమీన్‌పూర్ తహశీల్దార్ కార్యాలయంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి సోమవారం మండల పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **భక్తిధాంతండాలో భవానీమాత దీక్షలు**

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని బల్కంచెల్క తండా (భక్తిధాం తండా)లో సోమవారం తండాలోని విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మందిరంలో ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి మూడ్ కిషన్‌లలిత దంపతుల ఆధ్వర్యంలో 41 రోజుల దీక్షలకు శ్రీకారం చుట్టారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజ్ మాలధారణ చేయించారు.

◆ **పూర్వ అధ్యాపకుల సమ్మేళనం**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించిన పూర్వ ప్రిన్సిపాల్స్, అధ్యాపకుల సమ్మేళనాన్ని సోమవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం స్టేజీ నిర్మాణానికి రూ.1,10 లక్ష చెక్కును ప్రిన్సిపాల్‌కు అందజేశారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని అధ్యాపకులు రూ.90 వేలు ఇస్తామని ప్రకటించారు.

◆ **షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని జంగంపేట గ్రామంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో రూ.5లక్షలతో చేపట్టనున్న షెడ్డు నిర్మాణ పనులకు సోమవారం స్థానిక నాయకులు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, ఉపసర్పంచ్ గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

నోట్‌బుక్కులు పంపిణీ



రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తెల్లాపూర్, ఇంద్రానగర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా తెల్లాపూర్ నైబర్హుడ్ అసోసియేషన్, టీసీఎస్ సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్కులను పంపిణీ చేశారు. బ్యాంకు ఆఫ్ అమెరికా లోకేషన్ హెడ్ రవి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.